క్లుప్తంగా

సీడీపీఓకు ప్రశంసాపత్రం



కనకదుర్గకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ అనుదీప్

కొత్తగూడెంరూరల్: పాల్వంచరూరల్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఎస్‌కే నగర్ గ్రామపంచాయతీలోని కమ్మ సేవా సంఘం సత్రంలో మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరిగిన మహిళా సంక్షేమ దినోత్సవంలో సీడీపీఓకు ప్రశంసాపత్రం అందజేశారు.

శ్రీకాంత్ విగ్రహం ఏర్పాటు చేయండి

ఇల్లెందురూరల్: తెలంగాణ ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసుకున్న రామటెంకి శ్రీకాంత్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మండలంలోని మాణిక్యారం గ్రామస్తులు మంగళవారం కలెక్టర్ అనుదీప్, స్థానిక ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జిల్లాలో తొలి అమరుడైన శ్రీకాంత్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడంతోపాటు సహకరించాలని కోరినట్లు చెప్పారు. అంతేకాకుండా ఆయన కుటుంబానికి దళితబంధు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశామన్నారు.

రుణమాఫీ అమలు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా వెంటనే వడ్డీతో సహా రైతు రుణమాఫీ చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యదళ్లపల్లి సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు పెరగడానికి సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న విధానాలే కారణమని ఆరోపించారు. ఎరువులు, వ్యవసాయ పరికరాలపై సబ్సిడీని ఎత్తివేసి రైతుబంధు ఇచ్చినంత మాత్రాన రైతులకు మేలు చేసినట్లు కాదన్నారు. సబ్సిడీ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ విత్తన సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మోకాళ్ల రమేష్, కిన్నెర రామయ్య, ధర్మయ్య, ముత్తయ్య, లింబ పాల్గొన్నారు.

సమస్యలతో స్వాగతం పలికిన ప్రభుత్వ పాఠశాలలు

సింగరేణి(కొత్తగూడెం): ఈ విద్యా సంవత్సరం (2023–24) ఈనెల 12 నుంచి ప్రారంభమైన పాఠశాలల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భూపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యను నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభంతో విద్యార్థులు నూతనోత్తేజంతో పాఠశాలలకు వస్తున్నారు కానీ, స్కూళ్లు మాత్రం పలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయని పేర్కొన్నారు. వాటిని పరిష్కరించకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని తెలిపారు. కనీసం పాఠశాలలను శుభ్రం చేయకుండా, మౌలిక వసతులు ఏర్పాటు చేయకుండా, విద్యార్థులను చెత్తచెదారంలో కూర్చోపెట్టటం సరైంది కాదని పేర్కొన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలను శుభ్రం చేసి, మెరుగైన విద్యనందిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాది వేయాలని కోరారు.

ఆపదలో అత్యవసర వైద్యం

- ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో వేధిస్తున్న విద్యుత్ సమస్య
- ప్రారంభించినా మొదలుకాని డయాలసిస్ సేవలు
- ఎక్స్‌రే, స్కానింగ్‌లకూ అవే ఇక్కట్లు



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల



ప్రారంభించినా పనిచేయని డయాలసిస్ సెంటర్

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో అత్యవసర వైద్యానికి ఆపద వచ్చి పడింది. డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించినా విద్యుత్ సరఫరాలో లోపాలతో నిరుపయోగంగా మారింది. జనరేటర్, సోలార్ సెట్ పనిచేయటం లేదు. జనరేటర్ ఉన్నా సక్రమంగా పని సాఫీగా సాగడం లేదు. ఇల్లెందు ఆస్పత్రి వైద్య విధాన పరిషత్ పరిధిలోకి మారాక వైద్యులను నియమించడమే కాక అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈనేపథ్యాన విద్యుత్ వాడకం పెరిగి ప్రస్తుతం ఉన్న లైన్‌పై సరిపోవడంలేదు. ఫలితంగా ఎక్స్‌రే, రేడియాలజీ మిషన్, ల్యాబ్, ఏసీలు, ఫ్రిజ్‌లు, ఆపరేషన్ థియేటర్లు, ఎస్‌ఎంబీఎస్ సెంటర్లు నడవటం కష్టంగా మారింది. ఇక్కడకు వచ్చే ప్రతీ పది మందిలో ఎనిమిది మందికి స్కానింగ్ అవసరం ఉంటున్న నేపథ్యాన ఆస్పత్రిలో ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేస్తే చేస్తేనే విద్యుత్ అప్ అండ్ డౌన్ సమస్య తీరుతుంది.

నిరుపయోగంగా ఎనలైజర్

ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి నెల క్రితం ఎనలైజర్ మిషన్‌ను కేటాయించగా విద్యుత్ సదుపాయం లేక నిరుపయోగంగా మారింది. ఎనలైజర్ అందుబాటులోకి వస్తే 53 రకాల పరీక్షలు చేసే అవకాశం ఉంటుంది. జిల్లాకు రెండు మిషన్లు రాగా అందులో ఒకటిఇల్లెందుకు కేటాయించారు. దీనిద్వారా లివర్, కిడ్నీ, థైరాయిడ్, షుగర్ లాంటి పరీక్షలు సులభంగా చేసి పక్కా వివరాలతో రిపోర్ట్ ఇచ్చే అవకాశముంది. కానీ ఈ యంత్రం నడవాలంటే నాణ్యమైన విద్యుత్ అందాలి. ఒకవేళ కరెంట్ ఇబ్బందులు ఉంటాయనుకుంటే జనరేటర్, సోలార్ వ్యవస్థ అనుసంధానమై ఉండాలి. ఇవేవీ లేకపోవడంతో ఎనలైజర్‌తో పని మొదలుకావడం లేదు.

సీ–ఆర్‌ఎం మిషన్ లేక..

ఆర్థోపెడిక్ విభాగంలో కీలకమైన సీ–ఆర్‌ఎం మిషన్ లేకపోవటం వల్ల ఎముకలు విరిగిన వారికి వైద్యం అందించలేకపోతున్నారు. ప్రస్తుతం ఇల్లెందులో ఎముకల విభాగంలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. సీ–ఆర్‌ఎం మిషన్ ద్వారా ఎముక విరిగిన చోట స్టీల్ రాడ్ వేయడం సాధ్యమవుతుంది. ఈ యంత్రం కోసం ఇటీవలే టెండర్లు ఆహ్వానించారు. అయితే, యంత్రం వచ్చాక ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ కూడా ఏర్పాటుచేస్తే శస్త్రచికిత్సలు మొదలవుతాయి. ఇవేకాక సీఏఆర్‌ఎం, డ్రిల్లింగ్ తదితర యంత్రాలు కూడా రావాల్సి ఉంది.

ఎంఎస్ వైద్యుల బదిలీ..

ఆస్పత్రిలో గత డిసెంబర్ నుంచి ప్రసూతి ఆపరేషన్లు, ఇతర ఆపరేషన్లు కూడా మొదలయ్యాయి. కానీ ఎంఎస్ డాక్టర్ రాంచందర్‌నాయక్ అకస్మాత్తుగా బదిలీ కావటంతో నెల రోజులుగా శస్త్రచికిత్సలు ఆగిపోయాయి. ఆయన ఉన్నప్పుడు నాలుగు నెలల కాలంలో సుమారు 200 వరకు ఆపరేషన్లు చేశారు. మరోపక్క డాక్టర్ సింధు నేతృత్వాన ప్రసూతి విభాగంలో ఆపరేషన్లు జరుగుతున్నా, అత్యవసరమైన ఎంఎస్ డాక్టర్ లేక ఖమ్మం, కొత్తగూడెం రిఫర్ చేయాల్సి వస్తోంది. కాగా, వేతనం విషయమై సమస్యలతో వైద్యులెవరూ ఇల్లెందు ఆస్పత్రిలో విధులు నిర్వర్తించేందుకు రావడం లేదని తెలుస్తోంది.

రూ.6లక్షలు చెల్లించాం..



ఆస్పత్రికి ప్రత్యేక ట్రాన్స్‌ఫారం ఏర్పాటుచేసేందుకు విద్యుత్ శాఖ సూచన ప్రకారం రూ.6 లక్షల డీడీ చెల్లించాం. ఇక విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫారం బిగించటమే తరువాయి. ట్రాన్స్‌ఫారం ఏర్పాటైతే అన్ని యంత్రాలు నడుస్తాయి. ఏసీలు, స్కానర్, ఎక్స్‌రే ఇలా అన్నీ అందుబాటులోకి రానున్నాయి.

– డాక్టర్ జి.రవిబాబు, డీసీహెచ్‌ఎస్

ప్రజలు మెచ్చిన మోదీ సుస్థిర పాలన



మాట్లాడుతున్న రాంమోహన్‌రావు

ఇల్లెందు: రానున్నకాలంలో తెలంగాణలో బీజేపీ పాగా వేయటం ఖాయమని బీజేపీ జాతీయ కార్యదర్శి సభ్యుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి రాంమోహన్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని రాందేవ్‌బాబా మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మంలో జిల్లాలో మోదీ సుస్థిర పాలన మీద తీవ్రమైన చర్చ సాగుతోందన్నారు. చైతన్యవంతమైన ఖమ్మం జిల్లా ప్రజలు ఇప్పటి వరకు ఏడు పార్టీలకు ఈ జిల్లా నుంచి పట్టం కట్టారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచే బీజేపీ గెలుపుకు పునాదులు పడతాయన్నారు. తొమ్మిదేళ్లలో భారత్‌ను ప్రధాని మోదీ ప్రపంచ దేశాల సరసన నిలిపారని గుర్తు చేశారు. మోదీ ధైర్యసాహసాల ముందు చైనా లాంటి దేశం ఈ రోజు తోక ముడిచిందన్నారు. భారత్‌లో సుస్థిర పాలన బీజేపీకే సాధ్యం అన్నారు. జిల్లా ప్రజల నాడికి అనుగుణంగా ఖమ్మంలో అమిత్‌షా సభ నిర్వహించాలని బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయించినట్లు చెప్పారు. దళితులు, బీసీల అభివృద్ధి బీజేపీతో ముడిపడి ఉందన్నారు. యావత్ యువతకు మోదీ పాలన శిరోధార్యం అన్నారు. ఈ నెల 15న ఖమ్మంలో లక్ష మందితో సభ నిర్వహిస్తున్నామని, ప్రతీ నియోజకవర్గం నుంచి 10 వేల మందిని తరలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి ఎలాంటి ప్రతిపాదన పంపలేదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, ఊకే అబ్బయ్య, కోనేరు సత్యనారాయణ, రాకేష్‌రెడ్డి, బలగాని గోపీకృష్ణ, రాంచందర్‌నాయక్, మావునూరి మాధవ్, సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

టేకులపల్లి: టేకులపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సి ఉండగా కోరం లేకపోవడంతో ఈనెల 22కి వాయిదా వేశారు. ముందస్తుగానే ప్రజాప్రతినిధులు, అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ మధ్యాహ్నం 3 గంటల తరువాత ఎంపీపీ, ఎంపీడీఓలు సమావేశానికి వచ్చారు. అప్పటికే కొందరు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కొన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటల తరువాత కోరం లేకపోవడం, హాజరైన కొందరు ప్రజాప్రతినిధులు సంతకాలు చేయకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న రమేశ్

పాల్వంచ: ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే.రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణ కమిటీ సమావేశాన్ని ఎస్‌కే రహీం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ... ఏప్రిల్ 3న పార్టీ ఆధ్వర్యంలో పేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే తహసీల్దార్ వచ్చి 15 రోజుల్లో ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కానీ కాలం వెళ్లబుచ్చుతున్నారు తప్ప, అమలు చేయడం లేదని వాపోయారు. త్వరలో మరోసారి ప్రభుత్వ స్థలాల్లో పేదలతో గుడిసెలు వేయిస్తామని హెచ్చరించారు. భూ సమస్యపై జూన్ 19న కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దొడ్డా రవికుమార్, వి.సత్యవాణి, ఎస్‌కే.నిరంజన్, పి.తులసీరాం, పి.వెంకటరమణ, బి.కాంతి పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం



నూతన మండల కమిటీ సభ్యులు

టేకులపల్లి: వచ్చే ఎన్నికల్లో బహుజనులకు రాజ్యాధికారం దక్కడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో అత్యధికంగా ఉన్న బహుజనులను ఏకం చేసి రాబోయే కాలంలో బహుజన రాజ్యం స్థాపనకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం మండల అధ్యక్షుడిగా పూనెం రామస్వామి దొర, ప్రధాన కార్యదర్శిగా కాళ్ల రంజిత్‌ను ఎన్నుకున్నారు. నాయకులు లేతాకుల కాంతారావు, పల్లె ప్రశాంత్, పచ్చడి సత్యనారాయణ దొర, రాజు, బాదావత్ వాసు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చుంచుపల్లి: రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బ్యాడ్జీతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీసీఎస్‌కు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని, 2017, 2021 పెండింగ్ పేస్కేల్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులకు రావలసిన అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఇసనపల్లి శామ్యూల్, జాకబ్, గౌరవ అధ్యక్షుడు సీహెచ్ శివరామకృష్ణ, డిపో అసిస్టెంట్ సెక్రటరీ జానీమియా, డిపో కమిటీ సభ్యులు రఫీ, కార్మికులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఆవునూరి మధు

జూలూరుపాడు: అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. మంగళవారం భేతాళపాడు గ్రామ పంచాయతీ రాచబండ్లకోయగూడెంలో అమరవీరులు ఈసాల వెంకటేశ్వర్లు, ఏనుగు రాములమ్మ, కుంజా వెంకటేశ్వర్లు స్థూపాన్ని సీపీఐ(ఎంఎల్) ఎన్డీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి పోరాట విధానాలను పల్లెల్లో ఎరుపుమయం చేయడంలోనూ, పోడు భూముల సాధనకై ఈసాల వెంకటేశ్వర్లు, ఏనుగు రాములమ్మ, కుంజా వెంకటేశ్వర్లు కీలక పాత్ర పోషించినట్లు చెప్పారు. అమరవీరుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

నూతన సమాజ స్థాపన కోసం ప్రజాయుద్ధ పంథాలో పయనించి సాధించుకోవాలన్నారు. ఎస్కే ఉమర్, గౌని నాగేశ్వరరావు, కందగట్ల సురేందర్, కుంజా కృష్ణ, వల్లోజి రమేష్, మంచినీళ్ల భాస్కర్, ఏనుగు సీతయ్య, జావాజి నరసింహారావు, తెల్లం వెంకటేశ్వర్లు, మడి సీతారాములు, సురేష్, కూరాకుల నరసింహారావు, పద్మ, కల్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూతతో షెడ్ నిర్మాణం

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ సముదాయంలో కొండ్లె విజయకుమారి జ్ఞాపకార్థం కొండ్లె వెంకన్న రూ.లక్ష వ్యయంతో షెడ్ నిర్మించారు. ఈ షెడ్‌ను మంగళవారం దాతలు సందర్శించి ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ చైర్మన్ మహిపతి రామలింగానికి అప్పగించారు. సందీప్, చలువాది ప్రకాశ్ పాల్గొన్నారు.

మరికొద్ది రోజులు మజ్జిగ పంపిణీ చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు మరో పదిహేను రోజులు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్‌ను టీబీజీకేఎస్ నాయకుడు ఎండీ రజాక్ కోరారు. మంగళవారం జీఎంను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం ఏరియాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున మజ్జిగ పంపిణీని పొడిగించాలని విన్నవించారు.

నడిరోడ్డుపై ఇద్దరు వ్యక్తుల ఘర్షణ



కేఎస్‌పీ రోడ్డులో కొట్టుకుంటున్న వ్యక్తులు

పాల్వంచ: పట్టణంలోని కేఎస్‌పీ రోడ్‌లో ఇద్దరు వ్యక్తులు తీవ్రస్థాయిలో ఘర్షణకు దిగారు. మంగళవారం గుడ్‌మార్నింగ్ హోటల్ పక్కన ఎస్‌బీఐ రోడ్డు టర్నింగ్ వద్ద రోడ్డుపై ఒకరునొకరు దూషణలకు దిగి దాడి చేసుకున్నారు. కిందపడి మరీ కొట్టుకున్నారు. మధ్యలో ఓ మహిళ అడ్డురాగా ఆమెపై కూడా దాడికి పాల్పడ్డారు. సుమారు అరగంట పాటు రోడ్డుపైనే వీరంగం సృష్టించారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సినిమా షూటింగ్‌ను తలపించింది. స్థానికులు వచ్చి వారిని అడ్డుకున్నారు. రోడ్డుపై కొట్టుకుంటున్న వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

బోర్‌వెల్ లారీ స్వాధీనం



పోలీసు స్టేషన్ వద్ద బోర్‌వెల్ వాహనం

టేకులపల్లి: అనుమతి లేకుండా బోరు వేస్తున్న వాహనాన్ని అటవీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు టేకులపల్లి ఎఫ్ఆర్‌ఓ ముఖ్తార్ హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి తొమ్మిదో మైలుతండా పంచాయతీ సాయనపేట సమీపంలో బోరు వేస్తున్నట్లు సమాచారం రావడంతో అటవీ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి తనిఖీ నిర్వహించారు. బోరు వేసేందుకు సిద్ధంగా ఉన్న వాహనాన్ని పట్టుకుని టేకులపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సంఘటనకు సంబంధించి విచారణ నిర్వహిస్తున్నామని ఎఫ్ఆర్‌ఓ తెలిపారు.

రక్షణ కరువైన మహిళలు..



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న కామేశ్

పాల్వంచ: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. పలువురు పార్టీలో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాట్లాడుతూ.. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు జరగడం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కారకులపై విచారణ చేసి శిక్షించడంలో విఫలం చెందుతున్నట్లు చెప్పారు. ఇటీవల డాక్టర్ ప్రీతి, చైత్రబాయి లాంటి గిరిజన విద్యార్థుల చావులకు కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌కు బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కోలా మల్లిక, సరోజ, దుర్గమ్మ, లక్ష్మి, రమణ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కుట్ర చేసి వేధిస్తున్నారు..

ఇల్లెందురూరల్: తాను ఉపసర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి సర్పంచ్, కొందరు వార్డు సభ్యులు కుట్ర చేసి మానసికంగా వేధిస్తున్నారని బాలాజీనగర్ ఉపసర్పంచ్ యాకూబీ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేరులతో మాట్లాడారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వెంటనే పనులకు సంబంధించి తప్పుడు బిల్లులతో సంతకం తన వద్దకు వచ్చారని, తాను తిరస్కరించడంతో కుట్రతో తనపై అసత్య ఆరోపణలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వార్డు సభ్యురాలిగా పోటీ చేసిన నాడే ముగ్గురు పిల్లలు ఉన్నట్లు నివేదిక అందజేశానని గుర్తుచేశారు. ముగ్గురు పిల్లల అంశాన్ని ఇన్ని రోజులకు తెరమీదకు తెచ్చి తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని చెప్పారు. తాను కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకొని తిరిగి ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్నప్పటికీ మరోమారు వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. రాజకీయ పక్షాల నాయకులు, అధికారులు సమగ్రంగా విచారించి తనకు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. ఈ విషయమై సర్పంచ్ పాయం స్వాతిని వివరణ కోరగా.. పనులకు సంబంధించి అధికారులు ఎంబీ రూపొందించిన మేరకే బిల్లులు చేస్తారని చెప్పారు. తప్పుడు బిల్లులకు అవకాశం లేదన్నారు. ముగ్గురు పిల్లల అంశంపై వార్డు సభ్యులు కోర్టును ఆశ్రయించారని అందులో తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

నాయీబ్రాహ్మణుల నిరసన



షాపు ఎదుట వంటావార్పు చేస్తున్న సంఘం నాయకులు

పాల్వంచ: పట్టణంలోని హరిదామ బజార్‌లో కంపెనీ ఫ్రాంచైజ్ సహకారంతో కొందరు సెలూన్ షాపును ఏర్పాటు చేస్తుండటంతో మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అనంతరం షాపు ఎదుటే టెంట్ వేసి వంటావార్పు చేసి భోజనాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు తూముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇతర కులస్తులు తమ వృత్తిలోకి వచ్చి తమ పొట్టగొడితే సహించేది లేదన్నారు. ఇప్పుడిప్పుడే తమ వృత్తిపై ఆధారపడ్డ వారి బతుకులు నిలదొక్కుకుంటున్నాయన్నారు. తమది బిజినెస్ కాదని, సేవా వృత్తిగా గుర్తించాలన్నారు. నాయీబ్రాహ్మణులు కాకుండా ఇతరులు ఎవరైనా దీనిని వ్యాపారంగా చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ, సెక్రెటరీ తూముల సదానందం, కొమరవెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా షాపు నిర్వాహకులు 100 కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఘనంగా మహిళా ‘సంక్షేమ’ సంబరాలు



ఇల్లెందు: టీచర్లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ



పాల్వంచరూరల్: మహిళా ఇంజనీర్ల సన్మాన కార్యక్రమంలో ఎస్ఈ, ఈఈలు

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మహిళా సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. మంగళవారం ఇల్లెందు మార్కెట్ యార్డులో తెలంగాణ మహిళా సంక్షేమ సంబురాలు ఇల్లెందు యూనిట్ సీడీపీఓ ఎం.లక్ష్మీప్రసన్న అధ్యక్షతన జరిగాయి. అంతకు ముందు ఎమ్మెల్యే హరిప్రియకు బతుకమ్మలతో స్వాగతం పలికారు. అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ... మహిళల కోసం కేసీఆర్ కిట్టు, అమ్మఒడి, న్యూట్రీషియన్ కిట్లు, ఆరోగ్యలక్ష్మి, పారితోషికాల పెంపు, మహిళా భద్రతకు చర్యలు, షీటీమ్స్, భరోసా, సఖీ కేంద్రాలు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పథకాలు దేశంలో ఏరాష్ట్రంలో అమలులో లేవన్నారు. అంగన్‌వాడీ వర్కర్లను టీచర్లుగా ప్రకటించి వారి గౌరవానికి తగ్గట్లు గుర్తింపునిచ్చారన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జెడ్పీ చైర్మన్ ఆంగోతు బింధు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, జిల్లా అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, ఎంపీపీ చీమల నాగరత్నం, లాల్‌సింగ్, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అంకుషావలీ, ఇల్లెందు తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ బాలరాజు, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, మెప్మా, అంగన్‌వాడీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధి తోగ్గూడెం వద్ద గల మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రంలో మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళా ఇంజనీర్లను ఎస్ఈ సదాశివకుమార్ శాలువలతో ఘనంగా సత్కరించారు. ఇంట్రావిలేజ్ ఈఈ తిరుమలేష్, గ్రిడ్ ఈఈ నళినీ, డీఈ సాయి తోపాటు ఏఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అంగన్‌వాడీకి రక్షణ కరువు..



టేకులపల్లి మండలం చంద్రుతండా పంచాయతీ ఒడ్డుగూడెం (చంద్రుతండా) అంగన్‌వాడీ కేంద్రానికి రక్షణ కరువైంది. పక్కా ప్రహరీ లేకపోవడంతో కర్రలతో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన ఆహార పదార్థాలు, చిన్నారుల ఆట వస్తువులు, రికార్డులు, ఫర్నీచర్ తదితరాలు ఉంటాయి. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నెంబర్ : 9281479238